## 109. సూరహ్ అల్-కాఫిరూన్

سُورَةُ الكَافِرُون

అల్-కాఫిరూన్: సత్యతిరస్కారులు. Deniers of the Truth, The Disbelievers. ఈ సూరహ్ పేరు మొదటి ఆయత్ నుండి తీసుకోబడింది. ఇది, సూరహ్ అల్-మా'ఊన్ (107) తరువాత, మొదటి మక్కా కాలంలో అవతరింపజేయబడింది. సత్యధర్మ విషయంలో సమాధానపడటం / రాజీపడటం విశ్వాసులకు తగనిపని. ధర్మ విషయంలో కొంతవరకు రాజీపడమని, మక్కా ముష్రికులు దైవప్రవక్త('స'అస)తో అన్నప్పుడు ఈ సూరహ్ అవతరింపజేయబడింది. 'స'హీ'హ్ 'హదీస్'ల ప్రకారం క'అబహ్'తవాఫ్ తరువాత చేసే రెండు రక'ఆత్‌లలో, ఫజ్ర్ మరియు మ'గ్‌రిబ్ సున్నత్‌లలో దైవప్రవక్త ('స'అస) ఈ సూరహ్ (109), మరియు సూరహ్ అల్-ఇ'ఖ్‌లా'స్ (112) పఠించే వారు. అంతేకాదు అతను ('స'అస) తమ అనుచరులకు: "మీరు రాత్రి నిద్రపోయే ముందు ఈ సూరహ్ చదివితే షిర్క్‌నుండి దూరమవుతారు." అని, కూడా ప్రబోధించారు. (ముస్నద్ అ'హ్మద్-5/456, తిర్మిజీ'-3403, అబూ-దావూద్-5055 మొదలైనవి). ఇందులో **6** ఆయతులు ఉన్నాయి.

అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ۝

**1**. ఇలా అను: "ఓ సత్యతిరస్కారులారా!

قُلْ يٰۤاَيُّهَا الْكٰفِرُوْنَ ۝١

**2**. "మీరు ఆరాధిస్తున్న వాటిని నేను ఆరాధించను,

لَاۤ اَعْبُدُ مَا تَعْبُدُوْنَ ۝٢

**3**. "మరియు నేను ఆరాధిస్తున్న ఆయన (అల్లాహ్)ను మీరు ఆరాధించే వారు కారు.

وَلَاۤ اَنْتُمْ عٰبِدُوْنَ مَاۤ اَعْبُدُ ۝٣

**4**. "మరియు మీరు ఆరాధిస్తున్న వాటిని నేను ఆరాధించేవాణ్ణి కాను,

وَلَاۤ اَنَا عَابِدٌ مَّا عَبَدْتُّمْ ۝٤

**5**. "మరియు నేను ఆరాధిస్తున్న ఆయనను మీరు ఆరాధించే వారు కారు.

وَلَاۤ اَنْتُمْ عٰبِدُوْنَ مَاۤ اَعْبُدُ ۝٥

**6**. "మీ ధర్మం మీకూ మరియు నా ధర్మం నాకు!"[1]

لَكُمْ دِيْنُكُمْ وَلِيَ دِيْنِ ۝٦

---

**1**. మీరు మీ ధర్మాన్ని వదలటానికి సిద్ధంగా లేనప్పుడు! నేను నా సత్యధర్మాన్ని ఎందుకు వదలాలి? చూడండి, 28:55.